క్లుప్తంగా

రగ్గుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు రగ్గులు పంపిణీ చేస్తున్న వెంకటరామయ్య

అడ్డతీగల: పేదలకు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య చెప్పారు. రాజమండ్రికి చెందిన జ్యోతిష్యులు జనార్దనస్వామి కుమారి సౌజన్యంతో పేదలకు రగ్గులను వెంకటరామయ్య పంపిణీ చేశారు. చలి నుంచి రక్షణ కోసం పేదలరే రగ్గుల అందజేత కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కొయ్యూరు మండలం దొడ్డవరానికి చెందిన 50 మందితో పాటు అడ్డతీగల గ్రామపంచాయితీ పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న నలుగురుకి రగ్గులు అందజేశారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పెదబయలులో పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

పెదబయలు: మండల కేంద్రంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఎంఈవో కొరవంగి సింహాచలం, ఉపాధ్యాయ సంఘం నాయకులు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై సంఘం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్‌రావు, సంఘ అధ్యక్షుడు సీహెచ్ మత్స్యవర ప్రసాద్, ఎస్‌బి ఎల్ స్వామి, ప్రవీణ్, గంగమ్మ నాగరాజు, మల్లేశ్వరరావు, చంటిబాబు, మయూరి, దీప్తి,హిమబిందు,ఊర్మిళ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా భూ రీసర్వే



సర్వే చేస్తున్న సర్వేయర్ నాయుడు, ఫారెస్టు బీట్ అధికారి ధనేశ్వరి

జి.మాడుగుల: జిల్లా వ్యాప్తంగా భూ రీసర్వే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మండలంలో కుంబిసింగి పంచాయతీ సంగం గ్రామంలో భూముల రీసర్వే ప్రక్రియ వారం రోజుల నుంచి కొనసాగుతోంది. గ్రామంలో శనివారం జరిగిన సర్వేలో సర్వేయర్ నాయుడు, ఫారెస్టు బీట్ అధికారి జి.ధనేశ్వరి తెలిపారు. గిరిజన రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధుల నివారణ



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి అచ్యుత్

గూడెంకొత్తవీధి: ముందు జాగ్రత్త చర్యలతో చాలా వరకూ వ్యాధులను నియంత్రించవచ్చని గూడెంకొత్తవీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అచ్యుత్ అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా శనివారం దావనాపల్లి సచివాలయంలో ఆయన రోగులను పరీక్షించారు. గర్భిణులు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్‌ఎం శాంతి ఉన్నారు.

గింజర్తిలో పశువైద్య శిబిరం

కొయ్యూరు: చింతలపూడి పంచాయతీ గింజర్తిలో శనివారం నాబార్డ్ రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశు సంవర్ధకశాఖ వైద్యాధికారి కె.రాజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పశువులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మందులను రైతులకు పంపిణీ చేశారు. శిబిరంలో సుమారు 190 పశువులకు చికిత్స చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. రాంకీ ఫౌండేషన్ ప్రతినిధి హరికృష్ణ పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమమే జగనన్న ధ్యేయం

- కొయ్యూరు, హుకుంపేట, వై.రామవరం గ్రామాల్లో గడప గడపకు
- ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, ధనలక్ష్మి విస్తృత పర్యటన



గ్రామంలో పర్యటిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



కిముడుపుట్టులో గిరిజనులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ



పులుసుమామిడిలో గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కొయ్యూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రేవళ్లలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమెకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో 389 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఇంటింటా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. ఎన్ని పార్టీలు ఏకమై పోటీ చేసినా తిరిగి వైఎస్సార్‌సీపీ రెండోసారి కూడా అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. టీడీపీ నాయకుడు చంద్రబాబు ఎన్ని కుట్ర రాజకీయాలు చేసినా ఒరిగేదేమీలేదన్నారు. చంద్రబాబు, దత్తపుత్రుడితో కలిసి చేస్తున్న రహస్య ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారని, వారికి ప్రజలు మరోసారి సరైన విధంగా గుణపాఠం చెబుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. గ్రామంలో రెండేళ్లుగా పాఠశాల మూతబడడంతో పిల్లలను కొయ్యూరు పంపాల్సి వస్తోందని గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ఆమె స్పందించి తక్షణమే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పాఠశాలకు సంబంధించిన పూర్తి వివరాలతో రావాలని ఎంఈవో బోడంనాయుడుకు కలెక్టర్ తెలిపారన్నారు. స్థానిక సమస్యలను కలెక్టర్ దృష్టిలో ఉంచి నిధులు మంజూరు చేయిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఎంపీపీ బడుగు రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ జె.రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఆర్.మురిలి నాయుడు, సర్పంచ్‌లు సామన్నదొర, శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడ బాబులు, నాయకులు శేఖర్, ప్రసాద్, సూరిబాబు, దేముడు, కన్వీనర్లు రామారావు, కొండమ్మ, ఉప సర్పంచ్ వనంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: పేదలకు అండగా నిలుస్తూ వారి అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం గత్తుం పంచాయతీ కిముడుపుట్టు, మండిపుట్టు, మద్దిపుట్టు, బిల్లాపుట్టు, జీలుగులపుట్టు, చీకటిపుట్టు గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గిరిజనులతో కలిసి ఎమ్మెల్యే పాల్గుణ అల్పాహారం, అంబలి తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో 231 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి కష్ట, సుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారన్నారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. సర్పంచ్ పోతురాజు, ఎంపీటీసీ సభ్యురాలు కొండమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు కొండబాబు, సొసైటీ బ్యాంకు చైర్మన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వై.రామవరం: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని దాలిపాడు గ్రామ సచివాలయం పరిధిలోని పులుసుమామిడి, బూరుగుపాలెం, గుమ్మరిపాలెం, కిమ్ముడు వారి వీధి, దాలిపాడు గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 395 గడపలను ఆమె సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకతీతంగా అన్నివర్గాలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకుని, తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎంపీపీ కడబాల ఆనంద రావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వి.విశ్వమ్మ, ఎంపీటీసీ వి.సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు పి.రాజేశ్వరి, కె.వెంకయమ్మ, తహసీల్దార్ కె.సుధాకర్, ఎంపీడీవో అశోక్‌కుమార్, ఏపీవో ప్రకాష్‌బాబు, నాయకులు త్రిమూర్తులు, తమ్మిరెడ్డి, భారతిబాబు, బాబి, కనకరాజు, నూకరాజు, తిరుపతిరెడ్డి, పాల్గొన్నారు.

ఏ కష్టమొచ్చినా 'మీ కోసం.. మీ పోలీసు'



గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ దేముడుబాబు

అరకులోయ: ప్రజలకు ఏ కష్టమొచ్చినా మీ కోసం మీ పోలీసు కార్యక్రమం ద్వారా తగిన న్యాయం చేస్తామని సీఐ జి.దేముడుబాబు చెప్పారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మాడగడ పంచాయతీ, చంపగూడ, వంతమూరు గ్రామాలను ఆయన శనివారం సందర్శించారు. మీ కోసం మీ పోలీసు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాలు, దొంగతనాలు, మూఢనమ్మకాలు, గంజాయి, సారా నిర్మూలన కార్యక్రమాలపై సీఐ గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ దేముడుబాబు మాట్లాడుతూ సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రశాంత వాతావరణం, శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తోందన్నారు.సంక్రాంతి పండగలతో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తమ నివాస గృహాల్లో నగదు, ఆభరణాలు ఉంచకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో అనుమానస్పదంగా ఎవరైనా సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజల భద్రతపై పోలీసు శాఖ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. హెచ్‌సీ పురంధర్, సిబ్బంది ఉన్నారు.

సావిత్రి బాయి పూలే సేవలు శ్లాఘనీయం



సావిత్రి బాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

గంగవరం: యూటీఎఫ్ మండల మహిళా విభాగం ఆధ్వర్యంలో కొత్తాడ కేజీబీవీ ఆవరణలో సావిత్రి బాయి పూలే జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ మండల మహిళా అధ్యక్షురాలు లోతా రుక్మిణీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ బాలిక విద్యకు ఆనాడే సావిత్రిభాయి పూలే నాంది పలికారని, ఆమె ఆశయాలు అందరికీ ఆదర్శమన్నారు. ఆమె సంస్కరణలను బాలికలు, మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నేటి బాలికలు భావితరాలకు దిక్సూచిగా ఉండాలన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రతినిధులు కె.కృష్ణ, రఘుబాబు, రాంబాబు, ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయులు రామ, విజయలక్ష్మి, సునిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

బూడిద గుమ్మడికి డిమాండ్



సంతలో బూడిద గుమ్మడికాయలను మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న వ్యాపారులు

అనంతగిరి: సంక్రాంతి పండగతో మైదాన ప్రాంతాల్లో బూడిదగుమ్మడి కాయలకు బాగా డిమాండ్ నెలకొంది. ఏజెన్సీలోని వారపు సంతల్లో బూడిద గుమ్మడి కాయాల కొనుగోలుకు, మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు భారీగా తరలివస్తున్నారు. మండలంలోని ప్రధానంగా జరిగే కాశీపట్నం, డముకు వారపు సంతలకు ఈ వారం పెద్ద ఎత్తున బూడిదగుమ్మడికాయలను రిజన రైతులు తీసుకొనివచ్చారు. ఒక్కో గుమ్మడికాయ సైజ్‌ను బట్టి రూ.20 నుంచి రూ.50 వరకు ధర పలికింది. గతంలోని రూ.10 నుంచి రూ.20 ఉండే గుమ్మడికాయలు, ప్రస్తుతం ధర పెరగడం పట్ల గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారపు సంతల్లో కొనుగోలు చేసిన బూడిద గుమ్మడికాయలను వ్యాపారులు మైదాన ప్రాంతాల్లో రెండింతల ధరలకు విక్రయిస్తున్నట్టు పలువురు చెబుతున్నారు.

పింఛన్ల పంపిణీ



పట్టాలు, పింఛన్లు అందిస్తున్న సర్పంచ్ కృష్ణవంశీ, నేతలు

గూడెంకొత్తవీధి: పెదవలస పంచాయతీలో సర్పంచ్ కృష్ణవంశీ అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. సభలో పలు విషయాలను ప్రస్తావించారు. అమృత్ సరోవర్ పథకంలో పెదవలస చెరువును అభివృద్ధి చేయాలని, గ్రామాల్లో సారా నియంత్రించాలని, బొంతువలస, రంపుల గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలను వేయాలని, బడ్డుమామిడికి తాగునీటి సదుపాయం కల్పించాలని నిర్ణయించారు. అనంతరం ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. వైస్ ఎంపీపీ ఆనంద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ , పీఏసీఎస్ చైర్మన్ ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ మూర్తి తిమోతి తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

చింతూరు: కూనవరం మండలం బండారుగూడెంకు చెందిన గిరిజన యువతిని మోసం చేసిన శ్రీనుపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల కన్వీనర్ దాసరి రమణారెడ్డి అన్నారు. ఆయన శనివారం మాట్లాడుతూ వైద్యం, నిత్య పెళ్లిళ్ల పేరుతో శ్రీను గిరిజన యువతులను మోసం చేస్తున్నాడన్నారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ బండారుగూడెంకు చెందిన యువతి చేసే మౌన పోరాటానికి తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామన్నారు. అశోక్, రమణమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఎర్రాపాత్రుడు

అనంతగిరి: మండలంలోని ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఎర్రాపాత్రుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ ట్రైనింగ్‌లో భాగంగా విధులు నిర్వహించిన రాంబాయి ట్రైనింగ్ పూర్తి కావడంతో శుక్రవారం సీసీఎల్ఏ కార్యాలయంలో చేరారు. ఆమె స్థానంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎర్రపాత్రుడు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

కాఫీకి గిట్టుబాటు కల్పించాలి

అనంతగిరి: కాఫీకి గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం మండల అధ్యక్షుడు కొండలరావు అన్నారు. మండలంలోని పైనంపాడు పంచాయతీ కేంద్రంలోని గిరిజన కాఫీ రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు.కాఫీ పండ్లకు రూ.100, చెర్రీ పండ్లు రూ.300 కొనుగోలు చేయాలన్నారు.

రహదారి కోసం వినతి



రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్న కాకరపాడు గ్రామస్తులు

గూడెంకొత్తవీధి: రింతాడ పంచాయతీ పరిధిలో కాకరపాడు గ్రామానికి రహదారి సౌకర్యాన్ని కల్పించాలని స్థానికులు శనివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్‌ను కోరారు.ఆయన శనివారం గ్రామానికి సందర్శించగా, గ్రామస్తులంతా కలసి రహదారి నిర్మాణం విషయంపై వినతులు సమర్పించారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అధికారుల దృష్టికి రహదారి సమస్య తీసుకువెళ్లి నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

విస్తారంగా క్యాబేజీ సాగు

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ, గసభ, కండ్రుం తదితర పంచాయతీల్లో గిరిజన రైతులు విస్తారంగా క్యాబేజీ పంటను సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 300 ఎకరాల్లో క్యాబేజీ పంట పండిస్తున్నారు. గిట్టుబాటు ధర రావడంతో రైతులు క్యాబేజీ సాగుపై ప్రత్యేక దృష్టి సారించారు.క్యాబేజీ ధరలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు ఆనందరావు ,సుబ్బారావు చెబుతున్నారు.

స్తంభించిన సెల్ సేవలు: తప్పని ఇక్కట్లు

- నిలిచిపోయిన బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్
- మూగబోయిన సెల్‌ఫోన్లు, పనిచేయని ఇంటర్నెట్

రాజవొమ్మంగి: మండలంలో దాదాపు వారం రోజులుగా సెల్‌ఒన్, బీఎస్ఎన్ఎల్ సేవలు నిలిచిపోయాయి. ఇటీవల మూడు రోజుల పాటు మొరాయించిన బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ సేవలు మధ్యలో ఒక రోజు పని చేశాయి. తిరిగి గత మూడు రోజులుగా పనిచేయకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పనులకు సెల్‌ఫోన్లపై ఆధారపడే వారికి మరింత కష్టాలు పడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అంతమాత్రంగా ఉంటే ఇంటర్నెట్, సెల్‌ఫోన్ సేవలు బీఎస్ఎన్ఎల్ తరచూ మొరాయిస్తు ఉండడంతో పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. స్థానికంగా సమాచార వ్యవస్థ పూర్తిగా కుంటుబడింది. స్థానికంగా ఈ సంస్థకు చెందిన అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో వేలాది రూపాయల్లో ఇంటర్నెట్, సెల్ సర్వీసులకు రీచార్జ్ చేయించుకొని, అవి పని చేయక దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఏకలవ్య పాఠశాల భవనం ప్రారంభం



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నూతన భవనాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని, విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా మారాయన్నారు. గ్రామంలో సుమారు రూ.70లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఉపాధ్యాయులు, ఎంపీపీ ఆనంద రావు, జడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న పాడేరు సీఐ సుధాకర్

పాడేరు రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పాడేరు సీఐ సుధాకర్ చెప్పారు. పాడేరు పట్టణ శివారు మెట్టబంగ్లా, చింతలవీధి తదితర ప్రాంతాల్లో ప్రమాదకరమైన మలుపుల వద్ద శనివారం ప్రమాదక హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్ మాట్లాడుతూ ఇటీవల మలుపులు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, నివారించేందుకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, జీపులు, ఆటోలు అధిక లోడు, మితిమీరిన వేగంతో నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలోని పాడేరు ఎస్‌ఐ లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పల్పింగ్ యంత్రాల పంపిణీ



కాఫీ రైతులకు బేబి పల్పింగ్ యంత్రాలు అందజేస్తున్న జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ చైర్ పర్సన్ సరస్వతిదేవి

జి.మాడుగుల: కాఫీ రైతులకు సబ్సీడీపై అందిస్తున్న బేబి పల్పర్లు వినియోగించుకొని, నాణ్యమైన కాఫీతో ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ చైర్‌పర్సన్ మినుముల సరస్వతి దేవి, వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ తెలిపారు. కుంబిడిసింగి పంచాయతీ సంగం గ్రామంలో శనివారం వివిధ గ్రామాలకు చెందిన గిరిజన రైతులకు 90శాతం సబ్సీడీపై 30బేబి పల్పర్లను(పల్పింగ్ యంత్రాలు) పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఏజెన్సీలో రైతులు నాణ్యమైన కాఫీని తయారీ చేసి మార్కెటింగ్ ద్వారా అర్థికాదాయం పొందాలని వారు సూచించారు. ఆయా యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐటీడీఏ ఎఈవో అప్పలనాయుడు, ఎఫ్‌సీ ఎంజె పాత్రుడు, లైజన్ వర్కర్లు, కాఫీ రైతులు పాల్గొన్నారు.

నేడు, రేపు అమ్మవారి ఉత్సవాలు



అమ్మవారు

హుకుంపేట: గిరిజనుల ఆరాధ్య దేవత తోంకోట అమ్మవారి జాతర ఉత్సవాలు ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతగిరి, హుకుంపేట మండలాల సరిహద్దులో తోంకోట గ్రామం ఉంది.

ఏటా సంక్రాంతి పండగకు వారం రోజుల ముందు గ్రామ పెద్దలు నిర్ణయించిన తేదీల్లో అమ్మవారి జాతర జరుపుకోవడం ఆనవాయితీ. ఆలయంలో 16 చేతులతో కూడిన అమ్మవారి విగ్రహంతో పాటు బైరాగి మూర్తి విగ్రహం, పంచపాండవుల విగ్రహాలుండడం ప్రత్యేక ఆకర్షణ. ఏటా ఘనంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో ఏజెన్సీ శివారు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేస్తారు. ఈ ఏడాది కూడా అమ్మవారి ఉత్సవాలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సిబ్బంది

హుకుంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా బినామీ పేర్లతో పలువురు గిరిజనేతరులు గృహాలు, దుకాణాలు నిర్మిస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరుక సిబ్బందితో కలిసి తహసీల్దార్ రాజ్యలక్ష్మి శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గిరిజనేతరులు నిబంధనలు ఉల్లంఘించి చేపడుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే నోటీసులు ఇచ్చి కూల్చి వేస్తామన్నారు. తక్షణమే అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలన్నారు. ఆర్ఐ రంగారావు, వీఆర్వో కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

సంతకు పండగ కళ



వారపు సంతలో వస్త్ర దుకాణం



సంతలో నిత్యావసర వస్తువుల విక్రయాలు

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగిలో పండుగ సంత రకరకాల దుకాణాలతో కళకళలాడింది. సంక్రాంతి పండుగ వారపు సంత కావడంతో సుదూర గ్రామాల నుంచి గిరిజనులు తరలివచ్చిన పండుగకు అవసరమైన సరకులు కొనుగోలు చేశారు. సాధారణంగా జరిగే వారపు సంతకంటే ఈ సారి బెల్లం, నూనె, రకరకాల కూరగాయాలు తదితర నిత్యావసర వస్తువులతో పాటు వస్త్రాలు, ఇంటి సామగ్రి, ఇత్తడి, స్టీలు వంటపాత్రల దుకాణాలు, ఫర్నీచర్ స్టాల్స్ అత్యధికంగా వారపు సంతలో విక్రయాలు జరిగాయి. సంతలో రకరకాల కంపెనీల మోటారు సైకిళ్ల అమ్మకాలకు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటుచేశారు. ఇళ్లకు వేసే రంగులు, సున్నం , అలంకరణ సామగ్రి ఎక్కువగా అమ్ముడయ్యాయి. వారపు సంత కారణంగా రోడ్లపై రద్దీ పెరగడంతో ఎస్ఐ గోపీ నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు, వచ్చే పోయే వారి వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు.